
# మొక్కుబడి

పి. గణపతిశాస్త్రి

విపరీతమయిన యమ యాతనతో విలవిల్లాడిపోయాడు వెంకట్రావు. ఆ బాధలో అతనికి ఊపిరి కూడా ఆగిపోతున్నట్టనిపించింది.

పక్కనే నిలుచున్న భార్య తాయారమ్మ ఆ అవస్థ చూడలేక కళ్ళు రెండు గట్టిగా మూసుకుంది. ఆమె చెక్కిళ్ళ మీద వేడి వేడి కన్నీరు ధార కట్టి ప్రవహించింది. ఆ ఇల్లాలు చెంపలు వేసుకుని చేతులు రెండు జోడించి, ఏడుకొండలవాడికి నమస్కారం పెట్టింది. భర్త రోగం నయమయితే తలనీలాలు సమర్పించుకోగలనని మొక్కుకుంది.



అప్పటికి వెంకట్రావుకి ఏభై ఏళ్ళు పైబడ్డాయి. అదేమి మాయరోగమో గాని, అతన్ని పట్టి పల్లార్చి పిప్పి చేస్తోంది. అది ప్రారంభించి అప్పుడే అయిదేళ్ళు కావస్తోంది.

ఆ జబ్బు గ్యాస్ట్రిక్ అల్సరని ఆ ఇంట వారికాయించి వైద్యం చేస్తున్న డాక్టరు శేఖరం దానికొక పేరయితే పెట్టాడు గాని, అది తగ్గించడానికి వాడిన మందులన్నీ బూడిదలో పోసిన పన్నీరయాయి. ఆ తరవాత కడుపులో ఒక పెద్ద ఆపరేషన్ కూడా చేశాడు. అది అంతా సజావుగానే జరిగింది గాని, యాతనమాత్రం తగ్గలేదు. ఆ ఆపరేషన్‌తో రోగం పూర్తిగా తగ్గిపోతుందన్నాడు డాక్టరు. అది జరగలేదు సరికదా, క్రమక్రమంగా మరింతగా పెచ్చుపెరిగిపోయింది.

డాక్టరు శేఖరం తల బద్దలు కొట్టుకున్నాడు. రోగం పేరు మార్చి తిరిగి రకరకాల మందు లేవేవో గుప్పించాడు. కొన్ని వారాల పాటు కొంత గుణం కనిపించినా, పరిస్థితి అంతా మళ్ళీ యథాప్రకారంగా తయారయింది. అప్పుడప్పుడు పేగుల్లో నొప్పితో మెలికలు తిరిగి పోతూనే ఉన్నాడు వెంకట్రావు.

అతడు రెక్కలు ముక్కలు చేసుకుని స్వశక్తిపై పైకివచ్చిన వ్యక్తి. కనకనే కాబోలు, వెంకట్రావుకి దేవుళ్ళన్నా, మొక్కుబళ్ళన్నా బొత్తిగా నమ్మకం లేదు. కాని, బాధ భరించలేకపోయినందువల్ల నయితే నేమి, భార్య అదే పనిగా పోరడం వల్ల నయితేనేమి స్వామికి నమస్కరించి, "దర్శనం చేసుకుని స్వయంగా పూజచేస్తా" నని మొక్కుకున్నాడు.

ఆ పైన కొంతకాలం పాటు ఆ రోగం కొంచెం తగ్గింది. అదంతా ఆ ఏడుకొండల వాడి మహత్తే అని తాయారమ్మ ఎంతయినా మురిసిపోయింది. వెంకట్రావుకి కూడా గురి కుదిరింది. క్రమక్రమంగా దేవుడిమీది నమ్మిక బలపడింది. ఆ జబ్బు పూర్తిగా నిమ్మళిస్తే, స్వయంగా పూజ చేసి, హుండీలో

వెయ్యినూటపదహార్లు చెల్లించుకుంటానని మళ్ళీ మొక్కుకున్నాడు.

కాని, వారం రోజు లయినా తిరక్కముందే ఆ రుగ్మత మళ్ళీ మొదటికి వచ్చింది. పేగుల్లో వాడి బాకు మొనతో చీల్చివేస్తున్నట్టు భరించరాని బాధ ప్రారంభమయింది. ఎన్నెన్ని మందులు వాడినా, ఇద్దరు ముగ్గురు స్పెషలిస్టులు వచ్చి వైద్యం చేసినా అది మరి తగ్గలేదు. అప్పటినుంచి ఎందరో స్పెషలిస్టులన్నా, దేవుళ్ళన్నా, మొక్కులన్నా విపరీతమయిన విరక్తి బయలుదేరింది. ఇంటి వైద్యుడు శేఖరం ఇచ్చే మందు లేవో సేవిస్తూ, మొక్కుతూ, మూలుగుతూ అలాగే కాలక్షేపం చేస్తాడు వెంకట్రావు.

ఆ జబ్బు ప్రారంభం కాకమునుపు అతడు అన్ని విధాలా అదృష్టవంతుడే అని ఇరుగు పొరుగులు కొందరు అసూయ పడ్డారు. ఆ మాట నిజమే. ప్రాయం వచ్చే నాటికి తండ్రి మిగిల్చిపోయిన కొద్దిపాటి ఆస్తి తాకట్టు పెట్టి, సాహసించి, లారీ ఒకటి కొని నడిపించాడు వెంకట్రావు. క్రమక్రమంగా అతని యోగం అంతా తిరిగిపోయింది. ఆ పైన మరి రెండు లారీలు కొన్నాడు. ఆనాటికి ఆనాటికి ఆ వ్యాపారం బాగా లాభించింది. పట్టిందంతా బంగారమే అయింది. ఇప్పుడతనికి అయిదారు లారీలు, ఒక అంబాసడర్ కారు, చిన్న మేడ, నౌకర్లు, చాకర్లు మొదలయిన హంగామా అన్నీ ఏర్పడ్డాయి.

అప్పటికి తాను ప్రయోజకుడయినట్టు సంతృప్తి పడ్డాడు వెంకట్రావు. ఆ పైన పెళ్ళీడుకు వచ్చిన ఆడపిల్లలిద్దరికీ ఘనంగా పెళ్ళిళ్ళు చేసి అత్తవారిళ్ళకి పంపించాడు. ఆ పిల్లల తరవాత కలిగిన ఒక్కగా నొక్క మగ సంతానమే సుందరం.

ఎంతగా ప్రయత్నించినా మెట్రిక్ ఫైనల్ దాటి పైకి వెళ్ళలేకపోయాడు వెంకట్రావు. అయినా, చదువు సంధ్య అంతగా లేకపోయినా, మంచి ప్రయోజకత్వానికి ఒక గొప్ప ఉదాహరణగా తయారయాడు. కాని, వెంకట్రావు మనస్సులో తన కంతగా చదు వబ్బలేదన్న కించ లేకపోలేదు.

అయితే, సుందరం మాత్రం చిన్నప్పటి నుంచి చాలా తెలివైనవా డనిపించుకున్నాడు. పరీక్షలో ఒక్క ఏడాది తప్పకుండా వక్రమంగా పైకి వెళ్ళి మెకానికల్ ఇంజనీరింగులో బి. ఇ. పట్టా పుచ్చుకున్నాడు. కాని, అతనికి తగిన ఉద్యోగం దొరకడమే గగనమయింది.



శ్రీ శంకటాపురం శంకరాచార్యస్వామి ఆధ్వర్యంలో మద్రాసు క్రోంపేటలోని శ్రీరామ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కుంభాభిషేకం ఇటీవల జరిగింది

ఈ రోజుల్లో ఇంజనీర్లలో నిరుద్యోగ సమస్య ప్రబలిపోయిందని వెంకట్రావు స్నేహితులు కొందరు అతనికి తమ సానుభూతి వ్యక్తీకరించారు. ఇంకొక చిన్ననాటి నేస్తం తన ఇండస్ట్రియల్ కంబైన్స్‌లో సుందరానికి మూడువందలా ఏభై దాకా ముట్టజెప్పగలనని వాగ్దానం చేశాడు.

కాని, సుందరాని కది బొత్తిగా నచ్చలేదు. ఆ పైన వెంకట్రావు కూడా అంత పెద్ద చదువు చదివిన తన కొడుకుని ఆ చిన్న ఉద్యోగంలో చేర్పడాని కిష్టపడలేదు. ప్రస్తుతానికి స్వంత వ్యాపారంలోనే తగినంత తర్ఫీదు ఇవ్వడం మంచి దనుకున్నాడు. తన ఆరోగ్యం నానాటికి తీసికట్టుగా తయారవుతున్నప్పుడు, మరి కొంతకాలానికి పూర్తిగా విశ్రాంతి తీసుకోవడం తప్పదని కూడా ఆలోచించాడు.

అదే మాట కొడుకుతో అన్నాడు. ఆ ఆలోచన విని సుందరం బాగా నిరుత్సాహపడ్డాడు. అయినా, గత్యంతరం లేక దాని కంగీకరించాడు. ఆ విధంగా తండ్రికి చేదోడు వాదోడుగా ఉండవచ్చునని కొంతవరకు సమాధానపడ్డాడు.

అయిదారు నెలలు గడిచేసరికి సుందరానికి లారీ వ్యాపారంలో ఆనుపానులన్నీ ఒంటబట్టాయి. వెంకట్రావుకి క్రమంగా కొంత విశ్రాంతి చిక్కింది. ఇక ఆ వ్యాపారం అంతా కొడుక్కి అప్పజెప్పి, పైనించి అజమాయిషీ చేస్తూ కాలక్షేపం చేసుకోవచ్చు ననుకుని నిండుగా ఊపిరి పీల్చుకున్నాడు.

అయితే, అలాగ రెండు నెలలు గడిచేసరికి సుందరానికి జబ్బుచేసింది. మొట్టమొదట అది మలేరియా జ్వరమని చికిత్స ప్రారంభించాడు డాక్టరు శేఖరం. అది తిన్నగా దారిలో పడలేదు. ఆ పైన టెస్టులు కొన్ని జరిపించి డబుల్ టైఫాయిడ్ జ్వరమని తేల్చుకున్నాడు. శేఖరం విదేశాల్లో శిక్షణ పొంది అనుభవం గడించుకున్న ఆసామీ. కొంతకాలంపాటు ఇంగ్లండులో ప్రాక్టీసు కూడా కొనసాగించా డంటారు. మరేం గాభరా పడవలసిన అవసరం లేదని ఖచ్చితంగా భరవసా ఇచ్చాడు డాక్టరు.

"ఇదిగో, చూడండి. ఈ రోజుల్లో ఎలాంటి గడ్డు జబ్బు వచ్చినా, గోటితో గిల్లేసినట్టు ఇట్టే నయం చేస్తున్నా మండీ, వెంకట్రావు గారూ. అనవసరంగా కంగారు పడకండి. వండర్‌ఫుల్ డ్రగ్స్! మిరకిల్ డ్రగ్స్!"

రోల్డుగోల్డు కళ్ళజోడు తిన్నగా సవరించుకున్నాడు డాక్టరు.

అతడు చెప్పినట్టు ఆ తరవాత సుందరం జ్వరం తగ్గుముఖం పట్టింది. అవలక్షణాలు కొన్ని దారికి వచ్చాయి. కాని, టెంపరేచరు మాత్రమే తగ్గడం లేదు. నూట ఒకటి మీద రెండు మూడు పాయింట్లు దాకా పెరుగుతూంది. ఆ జ్వరం మొదలయి ఇంచుమించుగా నలభై రోజులయింది. సుందరం బాగా నీరసించి మంచానికి అంటుకుపోయాడు.

ఆ రోగం తగ్గించడానికి డాక్టరు శేఖరం శాయశక్తులా ప్రయత్నించాడు. కాని, తగ్గలేదు. డాక్టరు మనస్సులో అది డబుల్ టైఫాయిడ్ కాదేమో అన్న అనుమానం మొలకెత్తింది. మళ్ళీ రకరకాల టెస్టులు కొన్ని చేయించాడు. చిట్టచివరికి ఆ జబ్బేమిటో తిన్నగా అంతు చిక్కలేదు. అయినా, శేఖరం తన గట్టి పట్టుదల మాత్రం విడిచిపెట్టలేదు.

సుందరం మాంచి జబ్బ సత్తువున్న మనిషి. కొంచెం నల్లగా, పొట్టిగా, బొద్దుగా ఉంటాడు. చాలా నిదానమయిన వాడు. లేనిపోని ఆవేశాల జోలికి పోడు. అయినా బాగా డీలాపడిపోయేసరికి తానింక జీవించడం కష్టమని ఆందోళన పడ్డాడు. డాక్టరు ఎంతో ధీమాతో ఉన్నా, తన కింక మృత్యువు దగ్గిర పడిందని నిశ్చయించుకున్నాడు. ఆ పైన ఏది ఏమయినా సరే అనుకుని తిరిగి గుండె దిటవు తెచ్చుకున్నాడు.

ఆ తరవాత జ్వరం హఠాత్తుగా నూట అయిదు దాటింది. సుందరానికి అప్పుడప్పుడు చెరుపు, మరుపు ప్రారంభమయాయి. పరిస్థితి ప్రమాదకరంగా ఉందన్న సంగతి కాదనలేదు డాక్టరు. క్రమక్రమంగా అది మరింతగా విషమించింది.

అయినా, తాయారమ్మ కాళ్ళు విరగదొక్కుకోలేదు. ప్రతి రోజు చేస్తున్న పూజా పునస్కారాలన్నీ మరింతగా ఎక్కువ చేసింది. నిజానికి వెంకట్రావు రుగ్మత పూర్తిగా నయం కానేలేదు. అత డింకా పేగుల్లో నొప్పితో బాధపడుతూనే ఉన్నాడు. నానాటికి తీసికట్టుగా తయారవుతూనే ఉన్నాడు. అయితే, దైవం మీద ఆమె నమ్మక ఎక్కడ చెక్కు చెదరలేదు! ఆ స్వామి దయవల్లనే పెనిమిటి ఇంతవరకు బ్రతికి బట్టకట్టి ఎలాగో అలాగ లారీ వ్యాపారం నడిపించగలుగుతున్నారని సమాధానపడింది. ఎప్పటికయినా ఆయన రోగం నయం కాకపోదని గుండె చిక్కబట్టుకుంది.

ఆ తరవాత కొడుకు పరిస్థితి విషమించినా, తాయారమ్మ ఆత్రపడలేదు. ఆనా డామె పొద్దున్నే పూజా పునస్కారాలన్నీ ముగించుకుంది. ఆ పైన కొడుకు గండం గడిచి బయట పడితే దైవ దర్శనం చేసుకుని, నిలువు దోపిడీ ఇస్తానని మొక్కుకుంది. వెంకట్రావుని కూడా అదే విధంగా మొక్కుకోవలసిందని బలవంత పెట్టింది.

ఆ మొక్కుబడివల్ల ఫలితం కలగగలదన్న ఆశ కాస్త అతనిలో అంతకు మునుపే అడుగంటింది. అయినా, భార్య కాదు, కూడదని బలవంతం చేసినప్పుడు కాదనలేక కొడుకుమీది తీపికొద్దీ తప్పక స్వామి దర్శనం చేసుకోగలనన్నాడు.

సుందరాన్ని కూడా దర్శనం చేసుకోగలనని మొక్కుకోవలసిందని ప్రాధేయపడింది తాయారమ్మ. అతడు దాని కెంతమాత్రము అంగీకరించలేదు. 'అదంతా వట్టి నాన్సెన్స్' అన్నట్టు పెదముఖం పెట్టుకుని మాట్లాడ కూరుకున్నాడు. అతని దృష్టిలో అవన్నీ వట్టి మానసిక దౌర్బల్యాలు. అంతే. తల్లి ఎన్నెన్ని విధాల బ్రతిమాలుకున్నా ఆమె మాట చెవి కెక్కనియ్యలేదు. పేలవంగా నవ్వి క్షీణస్వరంతో అది తన

ఇష్టంలేదని చెప్పి, నీరసంతో కళ్ళు మూసుకున్నాడు.

పక్కనే నిలబడి రోగి పరిస్థితి ఎంతో ఆత్రంగా పరిశీలిస్తూ, పావు గంట కొకసారి ఇంజక్షను ఇస్తున్న డాక్టరు శేఖరానికి కూడా అలాంటి పేషెంట్లు ఎక్కువ లేరు. అందుచేత అంతటి ప్రమాద పరిస్థితిలో కూడా ఏమాత్రము తొణక్కుండా చిరునవ్వు చిందించి మౌనంగా పడి ఉన్న సుందరం ధైర్యాన్ని గమనించి, నిలువునా నిర్ఘాంతపోయి, అంతర్యంలో అతనికి చేతులెత్తి నమస్కరించాడు. అలాంటి వ్యక్తి నెలాగయినా బ్రతికించ గలిగితే అది తన కొక గొప్ప గర్వకారణం కాగలదని ఉబలాటపడ్డాడు.

అయితే, రోగి పరిస్థితి క్రమక్రమంగా క్షీణిస్తున్నట్టే కనబడింది. విరుచుకు పడబోతున్న ఆ ఘోరావర సంగతి తలుచుకుని, పాపం, వెంకట్రావు నిలువునా కుంగిపోయాడు. అటువంటి మణిపూస లాంటి కొడుకే పోయిన తరవాత నానాటికీ దిగజారిపోతున్న తనకింక గట్టి పట్టుగొమ్మ ఏది మిగిలింది? తన లారీ వ్యాపారం అంతా ఏమయిపోతుంది? చిన్నప్పటి నుంచి కట్టుకున్న ఆశలన్ని ఒక్కసారి కుప్పకూలిపోవలసిందేనా? తన పరిస్థితి అంతా ఎంతలో ఎంత అధ్వాన్నంగా తయారయింది! అతనికి ఒక్కసారిగా తన కాళ్ళు కుంగిపోతున్నట్టనిపించింది.

ఆ విషమ స్థితిలో కూడా తాయారమ్మ తన ధైర్యాన్ని వదలించ లేదు. చక్కగా స్నానం చేసి, నుదుట గుండ్రంగా పెద్ద బొట్టు పెట్టుకుని స్వామి పటానికి ఎదురుగా మోకరిల్లింది. రెండు చేతులూ జోడించి, కళ్ళు మూసుకుని ఏకాగ్ర చిత్తంతో ప్రార్థన ప్రారంభించింది.

డాక్టరు శేఖరం యథాశక్తి వినియోగించి రోగంతో పోరాడుతూనే ఉన్నాడు. ఆ నాడు అందరూ ఆ రాత్రి గడవడం కష్టమనుకున్నారు. ఏ క్షణంలో దుర్వార్త వినవలసివస్తుందో అని వెంకట్రావు దిగాలు పడిపోయాడు. నిస్సహాయ దృష్టితో కొడుకు ముఖం కేసి, డాక్టరు శేఖరి పరిశీలించాడు.

తెలతెల్లవారే వేళ ఒక ఆశాకిరణం తళుక్కుమని మెరిసింది. క్రమక్రమంగా సుందరం పరిస్థితి మెరుగయింది. ఆ సాయంత్రానికి సుందరం గండం గడిచి బయటపడ్డాడని ఉప్పొంగిపోయి డాక్టరు ఆ సంగతి విస్పష్టంగా వెల్లడించాడు.

వెంకట్రావు ఆనందానికి అంతే లేదు! అతనిలో ఇప్పుడు భగవంతుని ఉనికి మీద గట్టి నమ్మకం స్థిరపడింది. మొక్కుబడి మీద అంతకన్నా అచంచలమయిన భక్తి ఏర్పడింది. భార్య అన్నట్టు ఆ ఏడుకొండల వాడి కృప వల్లనే తానింత కాలము జీవించి ఉన్నట్టు గ్రహించుకుని చేతులెత్తి నమస్కరించాడు.

అయితే, పేగుల్లో నొప్పితో బాధ పడినప్పుడు మాత్రం ఏదయినా విషం పుచ్చుకుని వెంటనే చనిపోతే బాగుండునని అనుకోకపోలేదు. కాని, ఆ స్వామి కెప్పటి కయినా తన మీద జాలి కలగకపోతుందా అన్న ఆశతో ఆ క్షణం కోసం నిరీక్షించాడు.

సుందరానికి పథ్యం పెట్టిన వెంటనే భార్యతోపాటు కొండ మీదికి వెళ్ళి మొక్కుబళ్ళన్నీ యథావిధిగా చెల్లించుకున్నాడు వెంకట్రావు. అప్పటికే ధనుర్మాసోత్సవం ప్రారంభమయింది. ఆ మహోత్సవ సమయంలో స్వామి అలంకార వైభవం కళ్ళారా చూసి ఆ దంపతు లిద్దరు భక్తిప్రపత్తులతో పులకించారు.

ఇంకా మరి కొంతసేపు స్వామి సమక్షంలో నిలబడిపోతే బాగుండునని తాయారమ్మ ఎంతయినా ఉబలాటపడింది. వెంకట్రావు కాదనలేకపోయాడు. మరి కొన్ని నిమిషాలలోనే జనం రద్దీ ఉవ్వెత్తుగా ఉప్పొంగింది.

"ఏడుకొండలవాడా! వెంకటరమణా! ఆపద మొక్కుల వాడా!" అన్న పెను కేకలతో పెద్ద కోలాహలం చెలరేగింది. కోవెలంత గభీరంగా ప్రతిధ్వనించింది. క్షణ కాలం పాటు పట్టరాని ఆనందంతో ఆ దంపతు లిద్దరు స్వామి సమక్షంలో మైమరిచి నిలుచున్నారు.

అంతలోనే అకస్మాత్తుగా విద్యుద్దీపా లన్ని ఒక్కసారిగా ఆరిపోయాయి. జనంలో నించి పెద్ద తొక్కిడి, పెనుగులాట ప్రారంభ మయాయి. ఆ గందరగోళంలో పెద్ద గుంపు ఒకటి లోపలికి చొచ్చుకు వచ్చింది. ఆ రద్దీలో తాయారమ్మ పట్టులోనించి వెంకట్రావు చెయ్యి జారి పోయింది! ఆమె ఎలాగో అలాగ అతి కష్టం మీద దేవాలయం ద్వారం దగ్గిరకి చేరుకోగలిగింది.

అదే సమయంలో "అయ్యో! అయ్యో!" అన్న ఆక్రోశాలు, ఆర్తనాదాలు నలువైపుల ప్రతిధ్వనించాయి.

వెంకట్రావు ఆ పెనుగులాట తాకిడి భరించలేక నీరసంగా ఆక్రోశిస్తూ గర్భగుడి కెదురుగా చాపచుట్టగా నేలమీద కూలబడిపోయాడు. అనేకు లతని గుండెమీద, మెడమీద అడుగులు వేస్తూ దారికోసం తడుములాడుకున్నారు. ఆ పెనుగులాట ఇంచుమించు ఒక పావు గంట దాకా కొనసాగింది.

అంతలోనే దేవాలయాధికారులు కొందరు కలగజేసుకుని ఆ గందరగోళం చాలా వరకు తగ్గించారు. మరికొన్ని నిమిషాలలోనే లైట్లన్ని తిరిగి గప్పుమని వెలిగాయి.

వెంకట్రావుకి అంతకుముందే స్పృహ తప్పిపోయింది. డాక్టరు ఒకాయన తొందర తొందరగా అక్కడికి వచ్చి ప్రథమ చికిత్స చేశాడు. అప్పటికే అంతా అయిపోయింది.

అయినా, తుది క్షణంలో వెంకట్రావు పెదవి మీద బొండుమల్లె వంటి చిరునవ్వు నిశ్చలంగా మెరిసింది! ★

# 'తులసీ జలంధర'



## నాటక సమీక్ష

పౌరాణిక నాటకాల ప్రదర్శన అనుకున్నంత సులభం కాదు. నటీనటుల రూపరేఖావిలాసాలు ఆయా పాత్రలకు తగినట్లు ఉండాలి. రంగస్థలం మీద కమ్మని కంఠంతో పద్యాలను పాడి, హావ భావాలతో, పాత్రోచితమైన నటనతో మెప్పించాలి. దానితోపాటు పురాణగాథకు ఆ కాలానికి తగినట్లు ఆ వాతావరణాన్ని గుర్తు చేసేటట్లుగా సెట్టింగ్స్ మరీ ప్రధానమైనవి.

వీటన్నింటినీ కాస్తో కూస్తో సమకూర్చుకుని అనుసరించి అభినయించిన సమాజాల ప్రదర్శనలు ఉన్నంతలో విజయవంతం అవుతూనే ఉన్నాయి.

ఇటీవల మద్రాసు 'కళాసాగర్' వారి ఆధ్వర్యంలో రాజా అన్నామలై హాలులో 'తులసీ జలంధర' నాటకం ప్రదర్శించారు.

ఈ నాటకాన్ని చూస్తున్నంతసేపూ జలంధరునిగా నటించిన శ్రీ ఆచంట వెంకటరత్నం నాయుడి మీదే మన దృష్టి లగ్నం అయిపోతుంది. చాలా కాలానికి తెలుగు దేశంలో ఓ గొప్ప రంగస్థల నటుని చూశామన్న గర్వం ఉప్పొంగుతుంది. జలంధరుని లోని రాక్షసప్రవృత్తి ప్రదర్శనలో ఆ నవ్వు, ఆ కోపం, ఆ పద్యపఠనం, అభినయం చూసినప్పుడు ఆయన నటనా కౌశలాన్ని అభినందించ లేకుండా ఉండలేము.

ఈయన తరవాత శ్రీ కె. జనార్దనరావు ముచ్చటగా నారదుని పాత్రలో లీనమై నటించారు. మూడో పాత్ర మహాబలుడుగా నటించిన శ్రీ చోడవరపు అప్పారావు వేషం, నటన బాగున్నా తెచ్చి పెట్టుకున్న అనవసరపు హావ భావ ప్రదర్శనం బాగాలేదు.

తులసిగా నటించిన శ్రీమతి సునీత నటన బాగున్నా గొంతు బాగా లేదు. ఉచ్చారణ సరిగా లేదు. ఇక పార్వతిగా నటించిన రాజ్యం ఆ వేషానికి ఏమాత్రం ఒప్పలేదు.

శంకరుడుగా నటించిన శ్రీ బి. సత్యనారాయణరెడ్డి హుందాగా నటించారు. మిగిలిన పాత్రధారులు శ్రీయుతులు గోపీనాయుడు, అల్లం సూర్యారావు, బసవేశ్వరరావుల నటన ఇంకా బాగా ఉండాలి.

ఈ నాటకంలో సెట్టింగ్స్, ఎఫెక్ట్స్, దర్శకత్వం విషయాలలో తమిళ నటుడు మనోహర్ని బాగా అనుసరించినా, తెర లేచాక కూడా సీనరీలు మార్చడం, లైట్లు ఆర్పాలో మానాలో తెలియక గజిబిజి కలిగించడం, సెట్టులో సీనరీలు పడిపోతుండడం లేకుండా ఉంటే ప్రదర్శనం మరీ బాగా ఉండేది.

రచన, దర్శకత్వం వహించిన శ్రీ పి. వి. భద్రం, నాటకాన్ని ప్రదర్శించిన శ్రీ షణ్ముఖ నాట్యమండలి (తణుకు) వారు అభినందనీయులు.

నాటకానంతరం 'దుర్యోధన' ఏకపాత్రాభినయం చేసి శ్రీ ఆచంట వెంకటరత్నం నాయుడు తెలుగు ప్రాచీన నాటక రంగ వైభవాన్ని ప్రత్యక్షింప చేశారు.

ప్రథమంలో సినీనటుడు శ్రీ రేలంగి ప్రసంగించి 'కళాసాగర్' వారి కృషిని అభినందించారు.

—ఎల్లోరా